# అత్తగార్కి ఉత్తరం

- పచ్చిగోళ్ళ రోహిణి



ప్రభకి వివాహం నిశ్చయమైంది. పెళ్ళికి ఏ రకం చీరలు, నగలు కావాలో మీ అమ్మాయితో ఆలోచించి ఉత్తరం రాయించండి అని చెప్పారు ప్రభ అత్తగారు.

''ప్రభా! ఇలా రా ఒకసారి'' లోపలి నుండి కేక పెట్టింది తల్లి.

ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్న ప్రభ ''వస్తున్నా'' అంటూ లోపలికి వెళ్ళి ''ఎందుకే పిలిచావు?'' అని అడిగింది.

''నీ ఫ్రెండ్స్ ఉన్నారుకదా. అందరూ ఆలోచించి నీకేం కావాలో మీ అత్తగారికి ఉత్తరం రాయి'' అంది.

''అలాగే'' అంది ప్రభ.

కాగితం, పెన్ను తీసుకుని ''ముందు ఏమని రాయాలే'' సందేహంగా అంది ప్రభ.

ఒకరు 'డియర్ ఆంటీ అని రాయవే' అంటే, కాదు 'పెద్దవాళ్ళకు రాసేటప్పుడు అత్తమ్మగార్కి అని అని రాయాలి' అని ఇంకొకరు.. ఇలా అందరూ తలో రకంగా చెప్తుంటే ''అలాకాదు. అందరిలా రాస్తే మన గొప్ప ఏమిటి? వైరైటీగా సంబోధిద్దాం. ఈమధ్య మా అమ్మగారికి అదేదో కొత్త పదం ఉపయోగించి రాశారు. అలాగే నువ్వు కూడా గంగా భాగీరథీ సమానురాలైన అత్తమ్మగారికి అని మొదలుపెట్టు'' అంది.

''అవును. భలే వైరైటీగా వుంది'' అంటూ 'గంగా భాగీరథీ సమానురాలైన అత్తయ్యగారికి' అని మిగతా విషయాలు పూర్తిచేసి తల్లి దగ్గరకు పట్టుకెళ్ళింది ప్రభ ''అమ్మా చదవవా'' అంటూ.

''చదువుకున్నవాళ్ళు మీరందరూ కలసి రాస్తే ఇక నేను చూసేదేమిటి? మళ్ళీ దశమి వెళ్ళిపోతుంది. ఇప్పుడే పోస్టు చేయ్'' అంది.

''అలాగే'' అంది ప్రభ.

• • •

సాయంకాలం ప్రభ అన్నయ్య మోహన్ ఆఫీస్ నుండి వచ్చిన వెంటనే ''అమ్మా! ప్రభ చేత ఉత్తరం రాయించావా?'' అని అడిగాడు. వెంటనే ప్రభ గదిలోంచి బయటకు వచ్చింది రాశానంటూ.

''ఏం రాశావో చెప్పవే మీ అత్తగారికి'' నవ్వుతూ అడిగాడు.

''అన్నీ రాశానన్నయ్యా. ఉత్తరం ఎలా మొదలుపెట్టానో నువ్వు ఊహించలేవు తెలుసా. గంగా భాగీరథి సమానురాలైన అత్తయ్యగారికి'' అని అందో లేదో నవ్వుతున్న మోహన్ పెదవులు రెండూ ''ఆ'' అంటూ తెరుచుకున్నాయి ''కొంపముంచావుకదే'' అంటూ.

''గంగాదేవి విధవరాలు అవునో కాదో నాకు తెలీదు కానీ నువ్వు రాసిన ఆ సంబోధన మాత్రం భర్తపోయిన వాళ్ళకే రాస్తారు. ఇప్పుడెలాగే బాబూ... ఉత్తరం కూడా పోస్టు చేసానంటున్నావు? అమ్మా నీకు కూడా బుద్ధి లేదేమిటీ. అది మొదటిసారి రాసింది కదా. ఒక్కసారి చదవవచ్చు కదా. ఈ విషయం నాన్నగారికి చెప్పకండి. అడ్డమైన తిట్లు తిట్టి ఆయన కంగారుపడి మనల్ని కంగారు పెట్టేస్తారు. నేనే ఎలాగో మేనేజ్ చేస్తాలే. ఆ ఉత్తరం వాళ్ళకు అందితే వాళ్ళు మన సంబంధం కేన్సిల్ చేసుకున్నా చేసుకుంటారు. అందుకని నేను వాళ్ళ ఊరు వెళ్ళి. పోస్టాఫీసులోనే వాళ్ళకి ఆ ఉత్తరం చేరకుండా నేనే తీసుకుంటా. ప్రొద్దునే బయలుదేరి వెళతాను. అందుకనే అర్ధం లేని చదువులు వ్యర్ధం అని పెద్దలు ఊరికే చెప్పలేదు'' అని ప్రభని మరో రెండు చీవాట్లు పెట్టి వెళ్ళి పడుకున్నాడు మోహన్.

• • •

మర్నాడు ప్రభ అత్తగారి ఊరు వెళ్ళేందుకు బస్సు ఎక్కాడు మోహన్. ట్రాఫిక్ జామ్ అయి బస్సు నాలుగు గంటలు ఆగిపోయింది. తొందరకు ఆలస్యం మొగుడు అన్నట్లు ఇప్పుడే ట్రాఫిక్ జామ్ అవ్వాలా అని తిట్టుకున్నాడు. అక్కడ ఉత్తరం డెలివరీ ఇచ్చేస్తారేమోనని మనసులో ఆందోళన. ఎలాగైతే బస్సు గమ్యస్ధానం చేరింది.

ఆటో ఎక్కి పోస్టాఫీసుకు వెళ్ళి ''ఫలానా వాళ్ళకి ఉత్తరాలు ఏమైనా ఉన్నాయా?'' అని అడిగాడు.

అన్నీ డెలివరీకి వెళ్ళిపోయాయని అన్నారు.

వెంటనే వాళ్ళ అత్తగారి ఇంటికి వెళ్ళి చూద్దాం. లక్కీగా పోస్ట్‌మాన్ తను ఉండగానే వస్తే తనే తీసుకుని ఎలాగో మేనేజ్ చేద్దాం అని వాళ్ళింటికి వెళ్ళాడు.

తలుపు తీసే వుంది. లోపలకు వెళ్ళేసరికి ప్రభ అత్తగారు సోఫాలో కూర్చుని వుంది. టేబుల్‌మీద ఉత్తరం ఎగిరిపోకుండా పేపర్ పెట్టారేమో.. అది తొంగి తొంగి చూస్తోంది. అది ప్రభ రాసిన ఉత్తరమేనా? లేక వేరేవారు రాసినదా? ఇలా ఆలోచిస్తూ ఉండగానే ఆవిడ మోహన్ని చూసి ''రా బాబూ కూర్చో. అలా గుమ్మంలోనే నిలబడిపోయావేమిటి? అంతా కులాసానా?'' అని నవ్వుతూ పలుకరించింది.

ఆవిడ ఇంకా ఏదో మాట్లాడబోయేసరికి ఆ ఉత్తరం ప్రభ రాసినదా కాదా తేల్చుకోవాలని ''అత్తయ్యగారూ! కాసిని మంచినీళ్ళివ్వండి'' అన్నాడు. ఆవిడ లోపలకు వెళ్ళగానే ఆ ఉత్తరం తీసి చూసేసరికి అది ప్రభ రాసిన ఉత్తరమే.

ఇంతలో ప్రభ అత్తగారు మంచినీళ్ళ గ్లాసుతో రావడం చూసి ఏం చేయాలో తోచక ఉత్తరాన్ని ఉండ చుట్టి ఫేంటు జేబులోకి తోసేసాడు. 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని చెమట తుడుచుకున్నాడు.

మంచినీళ్ళిచ్చి ''ఇప్పుడే ప్రభ రాసిన ఉత్తరం అందింది. మీ మామయ్యగారు వచ్చాక ఆయన చదివి చెబుతారని తెరవకుండా ఇక్కడే పెట్టాను'' అని పేపర్ తీసింది. ఉత్తరం కనబడకపోయేసరికి ''క్రింద పడిందేమో'' అంటూ క్రింద వెదికింది. ''అదేమిటి ఇక్కడే పెట్టాను. ఇంతలో ఏమైంది? లోపలకేమైనా తీసుకువెళ్ళానేమో. ఒక్కటీ జ్ఞాపకం ఉండడంలేదు. ఎడం చేత్తో ఎక్కడ పెట్టానో ఏమిటో! అన్నీ వెతకడంతోనే సరిపోతోంది'' అంటూ లోపలకు వెళ్ళింది.

ఆవిడ అలా వెతుకుతుంటే మోహన్‌కి గుండెలోంచి ఆనందం పొంగి వస్తోంది. 'అమ్మ అత్తమ్మా! నీ నోట్లో పంచదార పొయ్యా. నీ జ్ఞాపకశక్తికి జోహార్లు. దొందుకు దొందే అన్నట్లు నా చెల్లెలు రాయడం, నువ్వు మర్చిపోవడం... సరిపోయింది. థాంక్‌గాడ్' అనుకుని తన సంతోషాన్ని కంట్రోల్ చేసుకుంటూ పైకి మాత్రం ఆవిడకు వినిపించేలా–

''ఫర్వాలేదండీ అత్తయ్యగారు. ఇక్కడికి పనిమీద వచ్చా. అర్జంటుగా ఒకరిని కలసి వెళ్ళిపోవాలి. మామయ్యగారు వచ్చేదాకా ఉండలేదని ఏమీ అనుకోకండి. ఎలాగూ వచ్చానని చూసి వెళదామని వచ్చా. మళ్ళీ వస్తాలెండి. మీకు ఆ ఉత్తరం కనిపించకపోతే దానికోసం కష్టపడి వెతక్కండి. ప్రభ చేత మీకు ఫోన్ చేయిస్తా'' అన్నాడు మోహన్.

బస్సు ఎక్కగానే ఉత్తరం తీసి 'నిన్నటి నుండి ఎంత టెన్షన్ పెట్టావే నన్ను' అంటూ కసితీరా చిన్నచిన్న ముక్కలు చేసి మిడిమిడి జ్ఞానంతో రాసి ఇలాగే ఆపదలు కొని తెచ్చుకుంటారు అనుకుంటూ బయటకు గిరవాటు వేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు మోహన్.

★